

విద్యుత్ కోతలపై నిరసన



ర్యాలీ చేస్తున్న రైతులు, టీడీపీ, జనసేన నాయకులు

కొత్తచెరువు, ఫిబ్రవరి 12: విద్యుత్ కోతలతో పంటలు ఎండుతున్నాయంటూ రైతులు ట్రాన్స్‌కో స్థానిక కార్యాలయం వద్ద సోమవారం నిరసనకు దిగారు. ముందుగా నాలుగు రోడ్ల కూడలి నుంచి టీడీపీ, జనసేన నాయకులు.. రైతులతో కలిసి ర్యాలీగా విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. అక్కడ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్కడికి చేరుకున్న ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశ్ నాయక్‌తో రైతులు మాట్లాడుతూ.. 9 గంటలు ఉచిత కరెంటు సరఫరా చేయాల్సి ఉండగా.. ప్రస్తుతం 7 గంటలే ఇస్తుండడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన చెందారు. విద్యుత్ మోటార్లు సైతం కాలిపోతున్నాయని వాపోయారు. అప్పు చేసి పంటలు సాగుచేస్తే.. కరెంటు కోతలు విధిస్తే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. 9 గంటల కరెంటు వదలకపోతే ట్రాన్స్‌కో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కరెంటు కోతలు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాలక్కగారి శ్రీనివాసులు, రామకృష్ణ, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్మీ రవి, బీడుపల్లి సుబ్బరాయుడు, గాజుల చంద్ర, జనసేన నాయకులు పూల శివ, భూపతి, పెద్దసంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

అన్నదాత ఆగ్రహం

పంపుసెట్లకు మీటర్ల బిగింపు అడ్డగింత



వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తున్న సిబ్బందిని అడ్డుకుంటున్న రైతులు



రైతులు ఎదురు తిరగడంతో వెళ్లిపోతున్న విద్యుత్ శాఖ ఉద్యోగి

మడకశిర రూరల్, ఫిబ్రవరి 12: వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్లు బిగించడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని కల్లుమర్రి గ్రామ పరిధిలోని వ్యవసాయ మోటార్లకు సోమవారం విద్యుత్ మీటర్లు బిగించేందుకు సిబ్బంది ఉపక్రమించారు. వారిని రైతులు అడ్డుకున్నారు. రైతులు మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ నిర్ణయం రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. ఎవరి మెప్పుకోసం సీఎం జగన్.. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తున్నారంటూ మండిపడ్డారు. అనంతరం రైతు సదాశివరెడ్డి వ్యవసాయ బోరుకు అమర్చిన మీటరును తొలగించారు. విద్యుత్ శాఖ సిబ్బందిని అక్కడి నుంచి పంపించేశారు. కార్యక్రమంలో కల్లుమర్రి సర్పంచ్ గంగమ్మ, క్లస్టర్ ఇన్‌చార్జి నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

నేడు నిజం గెలవాలి

జిల్లాలో నారా భువనేశ్వరి పర్యటన



పుట్టపర్తి, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జిల్లాలో నిజం గెలవాలి ఓదార్పు యాత్ర చేపట్టనున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును తట్టుకోలేక మృతి చెందిన వారి కుటుంబాలను నారా భువనేశ్వరి పరామర్శిస్తారు. పర్యటనలో భాగంగా మంగళవారం ఉదయం 10.30 గంటలకు శ్రీసత్యసాయి విమానాశ్రయానికి నారా భువనేశ్వరి చేరుకుంటారు. పుట్టపర్తి మండలం నిడుమామిడి గాజులకుంట మునిమడుగు బావయ్య కుటుంబాన్ని పరామర్శిస్తారు. ఓదార్పుయాత్ర ప్రారంభమై ఓబుళదేవరచెరువు మండలం గాజులకుంటపల్లిలో మేకల రామచంద్ర, కదిరి టౌన్‌లో ప్రకాష్, తనకల్లు మండలం కోర్తికోటలో షేక్ బుడేన్ సాబ్, కదిరి రూరల్ ముష్టిపల్లిలో చంద్ర, తలుపులలో చిన్నకోట్లమహేశ్వర కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. కదిరిలో హరీష్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆమె బస చేస్తారు

57 కిలోల వెండి సీజ్

చిలమత్తూరు, ఫిబ్రవరి 12: బెంగళూరు నుంచి తీసుకొస్తున్న 57 కిలోల వెండి ఆభరణాలను సోమవారం మండలంలోని కొడికొండ చెక్‌పోస్టులో పోలీసులు పట్టుకున్నారు. వేబిల్లు లేకపోవడంతో నగలను సీజ్ చేసి, హిందూపురం వాణిజ్య పన్నుల శాఖకు అప్పగించారు. ఎస్ఐ గంగాధర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొడికొండ చెక్‌పోస్టులో వాహన తనిఖీల్లో భాగంగా బెంగళూరు నుంచి అనంతపురం వైపు వెళ్తున్న కారును ఆపారు. అందులో తనిఖీ చేయగా.. రూ.45 లక్షల విలువచేసే వెండి ఆభరణాలను గుర్తించారు. హిందూపురం జీఎస్‌టీఓకి సమాచారం అందించగా... వారు వచ్చి ఆభరణాల బిల్లులు పరిశీలించారు. వేబిల్లులు లేని కారణంగా నగలను సీజ్ చేశారు. రవాణాదారులు జరిమానా చెల్లించడంతో ఆభరణాలను తిరిగి వారికే అందజేసినట్లు వెల్లడించారు.



సీజ్ చేసిన వెండి ఆభరణాలతో పోలీసులు

ఏముందని వాడేసుకోవాలి..?

పోలింగ్ కేంద్రాలకు నాడు-నేడు నిధులా?

- పాఠశాల హెచ్‌ఎంలే చూసుకోవాలని ఆదేశాలు
- పైసాలేకుండా ఎలా చేయాలంటున్న హెచ్‌ఎంలు
- ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్

ధర్మవరం

ప్రభుత్వ తీరు విడ్డూరంగా ఉంది. పాఠశాలల ఖాతాల్లో పైసా నిధుల్లేక నాడు-నేడు పనులు చాలాచోట్ల అర్ధంతరంగా ఆగిపోయాయి. చిన్నచిన్న అవసరాలకు కూడా నిధుల్లేక ప్రధానోపాధ్యాయు(హెచ్‌ఎం)లు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో పోలింగ్ కేంద్రాలుగా ఎంపికైన పాఠశాలల్లో ఏర్పాట్లకు నాడు-నేడు నిధులు వినియోగించుకోవాలంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నాడు-నేడు నిధులు పైసా కూడా లేకుంటే.. వాడుకోమనడం ఏమిటనీ, ఎక్కడి నుంచి వినియోగించాలని హెచ్‌ఎంలు మండిపడుతున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు సైతం ఎలాగోలా హెచ్‌ఎంలే ఏర్పాట్లు చేయాలంటూ హెచ్చరిస్తున్నట్లు హెచ్‌ఎంలు వాపోతున్నారు.

ఎలాగైనా చేయాల్సిందే..

ఎన్నికల వాతావరణం ముసురు కుంటోంది. ఓటరు జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన తదితరాలపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. పాఠశాలలో పోలింగ్‌కు అవసరమైన వసతులు హెచ్‌ఎంలే చూసుకోవాలనీ, నాడు-నేడు నిధులు వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు మనబడి నాడు-నేడు ఫేజ్-1, ఫేజ్-2 స్కూళ్లకు విడుదల చేసిన స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్ (ఎస్ఎంఎఫ్) నుంచి వాడుకోవాలని విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులు కూడా రాని స్కూళ్ల హెచ్‌ఎంలు అందుబాటులో ఉన్న ఇతర నిధులను ఖర్చు చేయాలని కూడా చెప్పారు. దీనిపై హెచ్‌ఎంలు భగ్గుమంటున్నారు. అసలు ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఇప్పటి వరకు స్కూల్ కాంపోజిట్ గ్రాంట్ల కింద పైసా ఇవ్వలేదు. నాడు-నేడు 2వ విడత పనులు చేస్తున్న స్కూళ్లకు ఇచ్చిన నిధులు ఖర్చయిపోయాయి. అలాంటపుడు ఖాతాల్లో నిధులు ఎలా ఉంటాయని ప్రశ్నిస్తున్నారు. నిధులు లేవని చెప్పుకుంటే ఎలాగైనా చేయాల్సిందేననీ, లేకుంటే ఊరుకోమని అధికారులు హెచ్చరిస్తున్నట్లు సమాచారం.

సగం సీఎం సభకు...

స్కూల్ గ్రాంటు ప్రతి పాఠశాలకు రూ.26వేలు చొప్పున ప్రభుత్వం ఖాతాలకు జమ చేసింది. ఇటీవల అన్నమయ్య జిల్లాలో సీఎం జగన్ సభ నిర్వహించారు. అందుకు జిల్లాలోని పాఠశాలల ఖాతాల నుంచి రూ.13 వేలు చొప్పున ప్రభుత్వం మరలా తీసేసుకుంది. దీంతో పాఠశాల అభివృద్ధి కుంటుపడుతోందని ఉపాధ్యాయ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. పాఠశాల నిర్వహణకు అవసరమైతే నాడు-నేడు నిధుల నుంచి కేటాయించుకోమని ప్రభుత్వం సూచిస్తోంది. అసలు ఏ పాఠశాలలోనూ నాడు-నేడు నిధులు మిగలలేదు. అవి చాలకే చాలా పాఠశాలల్లో నిర్మాణ పనులు కూడా నిలిచిపోయాయి. చాలామంది హెచ్‌ఎంలు చివరి దశలో ఉన్న నిర్మాణాలు పూర్తి చేసేందుకు సొంత డబ్బు వెచ్చించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆ బిల్లులు రాకపోతే తాము నష్టపోయి నట్లేనని ఆవేదన చెందుతున్నారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు పాఠశాల విద్యాశాఖ నిధులు ఖర్చుపెట్టడం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పాఠశాలలకు ఏదో ఒక పద్దు కింద నిధులు విడుదల చేయించాలని కోరుతున్నారు.

రెవెన్యూశాఖ వ్యవహారం

పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన అంశం పూర్తిగా రెవెన్యూ శాఖకు సంబంధించినది. ఆ శాఖ ఆధ్వర్యంలోనే ప్రతి సార్వత్రిక ఎన్నికకు ఏర్పాట్లు చేస్తారు. రెవెన్యూ శాఖ ఆదేశాల మేరకు ప్రతి తహసీల్దార్ తమ పరిధిలోని గ్రామ పంచాయతీ అధికారులతో మాట్లాడి ఏర్పాట్లు చేసేవారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా రెయిలింగ్, ర్యాంపులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈసారి అందుకు భిన్నంగా పాఠశాల విద్యాశాఖను ఏర్పాటు చేయాలని సూచించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ నిధులతో పాఠశాలల్లో ఉన్న పలు సమస్యలు పరిష్కరించే వీలుండేది.

మండిపడుతున్న హెచ్‌ఎంలు

జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, మున్సిపల్ పాఠశాలలు 3వేల దాకా ఉన్నాయి. వాటిలో 90 శాతం బడుల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పనులు పూర్తి చేయాలని కమిషనర్ నుంచి ఉత్తర్వులు రావడంతో హెచ్‌ఎంలు ఆందోళన చెందుతున్నారు. ప్రతి పాఠశాలలో దివ్యాంగుల కోసం రెయిలింగ్, ర్యాంప్‌ల నిర్మాణాలు చేపట్టాలనీ, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం పక్కాగా ఏర్పాటు చేయాలని, కిచెన్ షెడ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల విధులకు వచ్చే ఉద్యోగులకు వంట వండేందుకు భోజన శాల సిద్ధం చేయాలన్నారు. పోలింగ్ ఏర్పాట్లకు నిధులను ఎన్నికల సంఘం విడుదల చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి నాడు-నేడు పథకం కింద ఖర్చు పెట్టాల్సిన నిధులతో పోలింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించడం గమనార్హం. పాఠశాల అభివృద్ధికి కేటాయించిన నిధులను పోలింగ్ ఏర్పాట్లకు వెచ్చించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించడాన్ని హెచ్‌ఎంలు తప్పుబడుతున్నారు.



హెచ్‌ఎంలపై భారం మోపడం సరికాదు



పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లకు నాడు-నేడు నిధుల నుంచి హెచ్‌ఎంలు ఖర్చు చేయాలని ఉత్తర్వులు జారీ చేయడం సరికాదు. నాడు-నేడు పనులకు నిధుల కొరతతో ప్రభుత్వ పాఠశాలల్లో నిర్మాణాలు అర్ధంతరంగా ఆగిపోయాయి. ఈ పరిస్థితుల్లో నిధులు ఎక్కడి నుంచి తీసుకొచ్చి వసతులు కల్పించాలి? హెచ్‌ఎంలపై భారం మోపడం ఎంతవరకు సమంజసం? ప్రభుత్వం ఈ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి.

కోనంకి చంద్రశేఖర్, ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు

ఉత్తర్వులు రాలేదు

ప్రభుత్వం నుంచి నాడు-నేడు పనుల నిధులను పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనకు వినియోగించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అవి మాకు ఇంకా రాలేదు. జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చుంటాయి. కలెక్టర్ కార్యాలయం నుంచి తమకు ఇంకా ఉత్తర్వులు రాలేదు.

- మీనాక్షి, డీఈఓ

ఎన్నికల సంఘం నిధులను వినియోగించాలి



నిధులలేమితో నాడు-నేడు పనులు కుంటుపడ్డాయి. పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసే పాఠశాలలు నాడు-నేడు నిధుల నుంచి ఎన్నికల నిర్వహణకు హెచ్‌ఎంలు ఖర్చు చేయాలంటూ జీఓ జారీ చేయడం అవివేకం. ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం నిధులను రెవెన్యూ శాఖ ఉపయోగించి ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకోవాలి.

- శివ, యూటీఎఫ్ జిల్లా కార్యవర్గసభ్యుడు

ఘోరం

పెళ్లికి వెళ్లొస్తూ.. మృత్యు ఒడికి..



నుజ్జయిన బొలెరో వాహనం

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం
- 23 మందికి గాయాలు
- దాసప్పనపాళ్యంలో విషాదఛాయలు



కాంతరాజు (ఫైల్)



గోవిందప్ప (ఫైల్)



అమ్మాజమ్మ (ఫైల్)

అగళి, ఫిబ్రవరి 12: వివాహ వేడుకలో అందరూ ఆనందంగా గడిపారు. వధువు ఇంట ఆతిథ్యం స్వీకరించి, భోజనం చేసుకుని కబుర్లు చెప్పుకుంటూ తిరుగు ప్రయాణమయ్యారు. ఇంతలోనే ఘోరం. వారు వెళ్తున్న వాహనం.. లారీని బలంగా ఢీకొట్టింది. ఒక్కసారిగా హాహాకారాలు. ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. వాహనంలో మిగిలిన 23 మంది గాయాలతో రాత్రివేళ రోదించడం మొదలెట్టారు. మండలంలోని ఇరిగేపల్లి సమీపాన 544ఇ జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి లారీని పెళ్లి బృందం బొలెరో వాహనం ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందగా.. 23 మంది గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రొళ్ల మండలం దాసప్పనపాళ్యం గ్రామానికి చెందిన కరియన్న కుమారుడు మంజునాథ్ పెళ్లి కర్ణాటక రాష్ట్రం శిర నియోజకవర్గంలోని మరిడిగుడ్డలో ఆదివారం నిర్వహించారు. దాసప్పనపాళ్యం నుంచి వరుడి తరఫున వాహనాల్లో వివాహానికి హాజరయ్యారు. అదేరోజు రాత్రి వధువు స్వగ్రామమైన ఉచ్చుగీర్నహళ్లిలో భోజనం ముగించుకుని, దాసప్పపాళ్యంకు బొలెరో వాహనంలో 26 మంది తిరుగు ప్రయాణమయ్యారు. ఇరిగేపల్లి సమీపాన జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న సిమెంటు లారీని బొలెరో వాహనం బలంగా ఢీకొంది. దీంతో వాహనం నుజ్జునుజ్జయింది. ప్రమాదంలో కాంతరాజు(47), అమ్మాజమ్మ(35), గోవిందప్ప(67) అక్కడికక్కడే మృతిచెందారు. మిగిలిన 23 మందికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. గాయపడిన వారిలో 18 మందిని వేర్వేరు ఆస్పత్రులకు తరలించారు. మిగతా ఐదుగురు ఇంటి వద్ద చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. బెంగళూరులో చికిత్స పొందుతున్న వీరక్యాతప్ప పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతదేహాలను మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతిచెందిన కాంతరాజుకు భార్య లావణ్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. అమ్మాజమ్మకు భర్త శ్రీనివాస్, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గోవిందప్పకు భార్య భాగ్యమ్మ ఉంది. ప్రమాదంపై కేసు నమోదుచేసి, దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాద స్థలాన్ని ఎస్పీ మాధవరెడ్డి పరిశీలించారు. ప్రమాదానికి కారణాలపై విచారించారు. ఆస్పత్రిలో మృతదేహాలను పరిశీలించారు.

విషాదఛాయలు

ముగ్గురు మృతిచెందడం, 23 మంది గాయపడడంతో దాసప్పపాళ్యం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలియగానే గ్రామస్థులు పెద్ద సంఖ్యలో ప్రమాద స్థలం వద్దకెళ్లారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. ఊరిలో చాలావరకు జనం ఆస్పత్రులకు పరుగులు పెట్టారు. పోస్టుమార్టం అనంతరం సాయంత్రం మృతదేహాలను స్వగ్రామానికి తరలించారు. మృతుల కుటుంబికులు, బంధువుల రోదనలతో గ్రామం దద్దరిల్లింది.

ఆటో బోల్తాపడి ఒకరి మృతి

నలుగురికి తీవ్రగాయాలు

నల్లమాడ: మండలకేంద్రంలోని ఆర్టీటీ కార్యాలయ సమీపాన సోమవారం ఆటో బోల్తాపడి ఒకరు మృతిచెందగా, నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మలకవేమల క్రాస్ నుంచి పదిమంది ప్రయాణికులతో నల్లమాడకు బయల్దేరారు. నల్లమాడలోని ఆర్టీటీ సమీపాన విద్యుత్‌లైన్ లాగుతున్నారు. రోడ్డుకి అటువైపు ఉన్న స్తంభం నుంచి ఇటువైపు ఉన్నదానికి అనుసంధానంగా విద్యుత్ లైన్ లాగుతున్నారు. ఆ సమయంలో విద్యుత్‌వైరు ఒకటి కిందికి వేలాడుతోంది. అదే సమయంలో మలకవేమల క్రాస్ నుంచి వచ్చిన ఆటోడ్రైవర్ విద్యుత్ వైరును గమనించకుండా అతివేగంగా వచ్చాడు. వేలాడుతున్న వైరు ఆటో పైభాగాన ఉన్న స్టాండ్‌కు తగులుకుని, బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఓబుళదేవరచెరువు మండలంలోని కొండకమర్ల ఎస్సీ కాలనీకి చెందిన మేకల లక్ష్మణ (63) అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి కుమార్తె అరుణకు అనారోగ్యంగా ఉండడంతో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికెళ్లి మాత్రలు తీసుకుని, మలకవేమల క్రాస్ నుంచి ఆటోలో వస్తుండగా ప్రమాదం జరిగింది. విద్యుత్ లైన్ పనులు చేయిస్తున్న సూపర్‌వైజర్ నిర్లక్ష్యం, ఆటోడ్రైవర్ అతివేగం కారణంగా తన భర్త చనిపోయాడని లక్ష్మణ భార్య లక్ష్మీదేవి.. పోలీసులకు ఫిర్యాదు చేసింది. నల్లమాడ మండలం వేళ్లమద్ది గ్రామానికి చెందిన గంగులమ్మ, కొత్తపల్లి తండాకు చెందిన పీరిబాయి, పుట్టపర్తి మండలం కర్ణాటకనాగేపల్లి వాసి నారాయణమ్మ గాయపడ్డారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన విశ్వనాథ్ విశ్రా విద్యుత్ స్తంభంపై పనులు చస్తుండగా.. వైరును ఆటో లాక్కెళ్లడంతో స్తంభం విరిగి కిందపడ్డాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను నల్లమాడ ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కదిరికి తరలించారు. లక్ష్మణ మృతదేహాన్ని కదిరి ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు.



మేకల లక్ష్మణ మృతదేహం

వివాహితతో వలంటీర్ పరారీ

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 12: పెళ్లై ఇద్దరు పిల్లలున్న మహిళతో వలంటీర్ పరారవడం జిల్లాకేంద్రంలో చర్చనీయాంశంగా మారింది. గోకులంలో వలంటీర్‌గా పనిచేస్తున్న సొహైల్ మాయమాటలతో పెళ్లైన మహిళను వెంటతీసుకుని పరారయ్యాడు. తరచూ వివాహిత ఇంటికి వెళ్లి తాను అండగా ఉంటాననీ, పిల్లలు, భర్తను వదిలేసి రమ్మని ఒత్తిడి చేసేవాడని స్థానికుల సమాచారం. ఇలా ప్రలోభానికి లోనుచేసి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. వలంటీర్.. స్థానిక ప్రజాప్రతినిధికి అత్యంత సన్నిహితుడని సమాచారం. దీనిపై అర్బన్ సీఐ కొండారెడ్డిని అడగ్గా.. ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

రేషన్ కోసం నిరసన



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

చిలమత్తూరు, ఫిబ్రవరి 12: రేషన్ బియ్యం పంపిణీలో నిర్లక్ష్యంపై లబ్ధిదారులు నిరసనకు దిగారు. ప్రతినెలా ఒకటో తేదీన ఇవ్వాల్సిన రేషన్ బియ్యం 12వ తేదీ వచ్చినా పంపిణీ చేయకపోవడంతో మండల కేంద్రంలో లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైఠాయించి, నిరసన తెలిపారు. తమకు ఒకటో తేదీనే ఇవ్వాల్సిన బియ్యం ఇప్పటికీ అందలేదనీ, రోజూ రేషన్ షాపు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. విషయం తెలుసుకున్న డీలర్ వెంటనే షాపు తెరచి, లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేశారు.

కలెక్టర్ బంగ్లాలో చోరీ

గుట్టుగా పోలీసుల విచారణ... అదుపులో నిందితుడు?

పుట్టపర్తి, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ బంగ్లాలో బంగారు నగలు ఎత్తికెళ్లిన ఘటన పుట్టపర్తిలో కలకలం రేపింది. దీనిపై పోలీసులు గుట్టుగా విచారణ చేపట్టి, నిదుతుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో కలెక్టర్ అరుణ్ బాబు విజయవాడ వెళ్లారు. సోమవారం ఉదయం బంగ్లాకు తిరిగొచ్చారు. ఇంట్లో బంగారు కడియాలు, గొలుసులు చోరీ అయినట్లు గుర్తించారు. దీనిపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో పోలీసులు వెంటనే రంగలోకి దిగారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంతో సోమవారం సాయంత్రం గుట్టుగా విచారణ చేపట్టారు. చోరీ వెనుక కలెక్టర్ బంగ్లాలో పనిచేసే వ్యక్తి హస్తం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అతడిని అదుపులోకి తీసుకుని, విచారణ చేపడుతున్నట్లు తెలుస్తోంది.



కాదలూరు: జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు
కాదలూరులో జయహో బీసీ సదస్సు
వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు

డీ.హీరేహాళ్, ఫిబ్రవరి 12: బీసీల అభ్యున్నతికి అహర్నిశలు పాటుపడేది ఒక్క తెలుగుదేశం పార్టీనే అని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని కాదలూరు గ్రామంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి బీసీలు వెన్నెముక అన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలకు తగిన గుర్తింపు టీడీపీనే ఇచ్చిందన్నారు. అందుకు ఉదాహరణే తానేనని తెలిపారు. టీడీపీ హయాంలో బీసీలకు జరిగిన మేలుతో పాటు ప్రస్తుతం బీసీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని సూచించారు. రాయదుర్గం వైసీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్న మెట్టు గోవిందరెడ్డి ఒకసారి ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా, ఏపీఐఐసీ చైర్మన్‌గా పదవులు చేపట్టినా నియోజకవర్గానికి చేసిన మేలు ఏదీ లేదన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బీసీలకు స్వయం ఉపాధిరుణాలు, చేతివృత్తులకు ఆదరణ పథకం కింద రాయితీపై పరికరాలు అందించినట్లు గుర్తు చేశారు. బీసీలు బలహీనులు కాదని, బలవంతులన్నదే తమ పార్టీ సిద్ధాంతమని కాలవ శ్రీనివాసులు అన్నారు. జగన్‌ను ఇంటికి సాగనంపడానికి బీసీలందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన రాయదుర్గం ఇన్‌చార్జ్ మంజునాథ్‌గౌడ్, టీడీపీ బీసీ విభాగపు అధ్యక్షుడు ఆవుల కిష్టయ్య, గంజే నాగరాజు, చౌడయ్య, శివబాల, హనుమంతరెడ్డి, మోహన్‌రెడ్డి, పుష్పావతి, ఎంపీటీసీలు గంగాధర, మల్లికార్జున పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా చేరికలు

రాయదుర్గం: తెలుగుదేశం పార్టీలోకి వైసీపీకి చెందిన కుటుంబాలు పెద్ద ఎత్తున చేరుతున్నాయి. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు నివాసంలో సోమవారం రాయదుర్గం పట్టణానికి చెందిన ఫరూక్, జమీర్, సాధిక్, సన్నావుల్లా, అబ్దుల్లా, వసీం, తయ్యాబ్‌లతో పాటు 25 కుటుంబాలు పార్టీలో చేరాయి. రాయదుర్గం మండలంలోని గోపాల్, కొల్లప్ప, దుర్గప్ప, మల్లికార్జునతో పాటు 23 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. డీ.హీరేహాళ్ మండలం హడగలి గ్రామానికి చెందిన మల్లికార్జున, సిద్ధప్ప, చంద్రప్పలతో పాటు 29 కుటుంబాలు టీడీపీలో చేరాయి. పార్టీలో చేరిన వీరికి కాలవ శ్రీనివాసులు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్లు హనుమంతరెడ్డి, హనుమంతు, కాదలూరు మోహన్‌రెడ్డి, పప్పులబట్టి తిప్పేస్వామి, మొుండి మల్లికార్జున, బంగి శంకర్, వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.



రాయదుర్గం మండలంలోని మల్కాపురం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న కాలవ శ్రీనివాసులు

టీడీపీ పాలనలో పేదలకు వరం సీఎం సహాయనిధి

రాయదుర్గం: టీడీపీ పాలనలో ముఖ్యమంత్రి సహాయనిధిని పేదలకు ఒక వరంగా మార్చి వందలాదిమందికి ఉపయోగపడ్డామని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. తన 50 వారాల సెల్ఫీ చాలెంజీలో భాగంగా టీడీపీ హయాంలో సీఎం సహాయనిధి ద్వారా ఉపశమనం పొందిన లబ్ధిదారులతో సోమవారం ఆయన 44వ సెల్ఫీ దిగారు. నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల వారు ఆర్థిక స్తోమతకు మించి ఆపరేషన్లు, మెరుగైన చికిత్సలు పొందడానికి లక్షలాది రూపాయలు ఖర్చు చేసుకున్న సందర్భాల్లో వారిని ఆర్థికంగా ఆదుకున్నామన్నారు. గుండె, ఊపిరితిత్తులు, క్యాన్సర్ వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి ఆధునిక చికిత్స కోసం పెద్ద మొత్తాలను ప్రభుత్వం నుండి నేరుగా ఆయా ఆసుపత్రులకు మంజూరు చేయించామన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలోని బాధితులకు తన హయాంలో సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా రూ. 6.24 కోట్ల ఆర్థిక సహాయం అందించామన్నారు. గుండెజబ్బులతో బాధపడుతున్న చిన్నారులకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఆపరేషన్లు చేయించామన్నారు. ముఖ్యమంత్రి జగన్ రాయదుర్గం నియోజకవర్గంలో ఎంత మందిని సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకున్నాడో చెప్పాలన్నారు.

జగన్ పాలనలో అన్నివర్గాలకు నష్టమే

- మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు



మహిళలతో మాట్లాడుతున్న జితేంద్ర గౌడు

గుంతకల్లు, ఫిబ్రవరి 12: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో నష్టపోని వర్గమంటూ ఏదీ లేదని మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు పేర్కొన్నారు. పట్టణంలోని 17వ వార్డులో భవిష్యత్తుకు గ్యారెంటీ ప్రచార కార్యక్రమాన్ని సోమవారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు మహిళలకు ప్రచార పత్రాలను అందజేసి చంద్రబాబు హామీలను వివరించారు. ప్రభుత్వ వైఫల్యాలను విశదీకరించారు. జగన్ అనుభవలేమి, బాధ్యతారాహిత్యం, అవినీతి కారణంగా రాష్ట్రంలోని ప్రతివర్గమూ నష్టపోయిందని తెలిపారు. చార్జీలను పెంచి పేద, మధ్యతరగతి ప్రజలకు పూటగడవని దుస్థితి కల్పించాడన్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేకుండాచేసి యువతను నిరుద్యోగులుగా మార్చాడన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీకి ఓటువేసి చంద్రబాబు నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్‌కుమార్ గౌడు, అనిల్ కుమార్ గౌడు, నాయకులు గుడిపాటి ఆంజనేయులు, తలారి మస్తానప్ప, శివన్న, బండి లక్ష్మీదేవి, రామన్న చౌదరి, ఆటోఖాజా, జగన్నాథ్, మునయ్య చిప్పగిరి ప్రతాప్ పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల

అనంతపురం విద్య, ఫిబ్రవరి 12: రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు సోమవారం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు జీవో నెంబర్ 12 విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలో 386 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఎస్‌జీటీ పోస్టులు 107 కాగా, అందులో పాఠశాల విద్యాశాఖ యాజమాన్యంలో 106 పోస్టులు, ట్రైబల్‌లో 1, స్కూల్ అసిస్టెంట్స్ 164 పోస్టులు కాగా విద్యాశాఖలో 161 పోస్టులు, ట్రైబల్‌లో 2, ఏపీటీడబ్ల్యూఆర్ఐ ఈఎస్‌లో 1 పోస్టు, టీజీటీ పోస్టులు 115 కాగా ఏపీ మోడల్ స్కూల్స్‌లో 29, బీసీ వెల్ఫేర్‌లో 13, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఐఈఎస్‌లో 25 పోస్టులు, ఏపీటీడబ్ల్యూఆర్ఐఈఎస్‌లో 39, ఏపీఆర్ఈఐఎస్‌లో 9 పోస్టులు భర్తీ చేయనున్నారు.

స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) పోస్టులు ఇలా...

తెలుగు 11, హిందీ 27, ఇంగ్లిష్ 53, గణితం 21, ఫిజికల్ సైన్స్ 12, బయాలజీ 6, సోషియల్ 5, ఫిజికల్ ఎడ్యుకేషన్ 26 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులన్నీ స్కూల్ ఎడ్యుకేషన్ యాజమాన్యంలోనే భర్తీ చేయనున్నారు. వీటితోడు విద్యాశాఖ యాజమాన్యం కింద ఎస్‌జీటీలు 106 పోస్టులు భర్తీ చేయనున్నారు. మొత్తంగా 267 పోస్టులు విద్యాశాఖ యాజమాన్యం కింద భర్తీచేయనుండగా, మిగిలిన 119 పోస్టులు ఇతర యాజమాన్యాల కింద భర్తీ చేయనున్నారు. ఈనెల 22వ తేదీ వరకూ దరఖాస్తులను స్వీకరించనున్నారు. మార్చి 15వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ పరీక్షలు నిర్వహించనున్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 12: ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం డిపో ఆధ్వర్యంలో మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎం నాగభూపాల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ ప్రయాణికులు తమ సందేహాలు, ఫిర్యాదులను మంగళవారం సాయంత్రం 4 - 5 గంటల మధ్య 08554 248553 లేదా 99592 25853 నెంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని సూచించారు.

మళ్లీ 'శ్రీరామిరెడ్డి' కార్మికుల సమ్మె



పంప్ హౌస్ దగ్గర నిరసన తెలుపుతున్న కార్మికులు

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 12: శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు మళ్లీ సమ్మె బాట పట్టారు. మున్సిపాల్టీ పరిధిలోని శ్రీరామ్‌రెడ్డి పంపుహౌస్ ఎదుట సోమవారం నిరసనకు దిగారు. వీరికి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబుళు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి నెలలో తమ సమస్యలు పరిష్కరించాలంటూ సమ్మె బాట పట్టగా ఎంపీ రంగయ్య వారంలోపు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే దాదాపు 20 రోజులైనా సమస్యల గురించి పట్టించుకోకపోవడంతో సమ్మెలోకి దిగాల్సి వచ్చిందన్నారు. నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. గత నెల 22న మున్సిపల్ చైర్మన్ తలారి రాజ్‌కుమార్, వైస్‌చైర్మన్ ఫణీంద్ర తదితరులు వచ్చి బలవంతంగా ఓటర్లు ఆన్‌చేసి వెళ్లారని ఆరోపించారు. తమ సమస్యలను పరిష్కరించని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి

జిల్లా కలెక్టర్ గౌతమి
రాయదుర్గంలో స్ట్రాంగ్ రూం పరిశీలన
గుమ్మఘట్టలో పోలింగ్ కేంద్రం తనిఖీ



ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ గౌతమి

రాయదుర్గం, ఫిబ్రవరి 12: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. మండలంలో సోమవారం ఆమె విస్తృతంగా పర్యటించారు. పట్టణంలోని మార్కెట్‌యార్డులో స్ట్రాంగ్‌రూమ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రం కోసం గోడౌన్, ఉర్దూ స్కూల్‌ను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 190, 191, 192 పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు-2024 సన్నద్ధతలో భాగంగా రాయదుర్గం నియోజక వర్గానికి సంబంధిత మార్కెట్‌యార్డ్‌లో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించామన్నారు. ఒకే స్థానంలో 4, 5 మల్టిపుల్ పోలింగ్ కేంద్రాలు ఉంటే ఆయా పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలన్నారు. పోలింగ్ రోజు ఓటు వేయడానికి వచ్చే ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. దివ్యాంగుల కోసం ర్యాంప్, అన్ని కేంద్రాల్లో వెలుతురు కోసం లైటింగ్, ఫ్యాన్లు, ఫర్నిచర్, తాగునీరు, మరుగుదొడ్లు అన్ని రకాల వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలను రిటర్నింగ్ అధికారులు, ఏఆర్వోలు తనిఖీ చేసి అన్ని వసతులు ఉన్నాయా లేదా అనేది పరిశీలన చేసి ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఎన్నికలకు సంబంధించి జిల్లాలో 8 నియోజకవర్గాలకు రిసెప్షన్ కేంద్రం అనంతపురంలోని జేఎన్‌టీయూ లో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రం కూడా అక్కడే ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 2,213 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేశామని, కొత్తగా 23 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇప్పుడు కంటిన్యూషన్ ఆప్డేషన్ కింద ఏదైనా పోలింగ్ స్టేషన్‌లో 1500 మంది ఓటర్లు దాటితే అదనంగా పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదిస్తామన్నారు. మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసే డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద ఈవీఎం రాండమైజేషన్, పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాణిసుస్మిత, డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్ చిట్టిబాబు, వివిధ శాఖల అధికారులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

వేపరాళ్ల గ్రామం వద్ద ఇసుక రీచ్ తనిఖీ

మండలంలోని వేపరాళ్ల గ్రామం వద్ద ఇసుక రీచ్‌ను జిల్లా కలెక్టర్ గౌతమి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంజీటీ నామ్స్ ప్రకారం అన్ని జిల్లాల్లో రీచ్‌లను తనిఖీ చేసి రిపోర్ట్ అందించాలని ప్రభుత్వం కలెక్టర్లను ఆదేశించిందన్నారు. జిల్లాలో ఎనిమిది కొత్త ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించామని, మంజూరైతే ఇసుక కొరత ఉండదన్నారు. మండలంలో రూ.60 లక్షల అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు వెల్లడించారు. ఇసుకకు అదనంగా డబ్బులు వసూలు చేయకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాణిసుస్మిత, డీఎస్పీ శ్రీనివాసులు, తహశీల్దార్ చిట్టిబాబు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండలంలోని 75 వీరాపురం, గుమ్మఘట్ట గ్రామాలలోని పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను సోమవారం జిల్లా కలెక్టర్ గౌతమి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల గదులను పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి మౌలిక వసతులపై ఆరా తీశారు. అనంతరం మండలంలోని పోలింగ్ కేంద్రాల తనిఖీ అధికారిగా గుమ్మఘట్ట ఎంఈఓ-2 రామచంద్రను నియమించి మండలంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించాల్సిందిగా ఆదేశించారు.

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి: ఉన్నం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఉన్నం హనుమంతరాయచౌదరి

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 12: గ్రామాలన్నీ అభివృద్ధి చెందాలంటే టీడీపీతోనే సాధ్యమవుతుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్నం హనుమంతరాయచౌదరి అన్నారు. సోమవారం కంబదూరు మండల పరిధిలోని జక్కిరెడ్డిపల్లి, కొత్తపల్లిలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. చీరలు కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉన్నం హనుమంతరాయచౌదరి కోడలు ఉన్నం వరలక్ష్మీ, టీడీపీ నాయకులు గాజుల శ్రీరాములు, ఆవుల తిప్పేస్వామి, తలారి యర్రిస్వామి, దండా వెంకటేశులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ ఆత్మహత్య

ఉరవకొండ, ఫిబ్రవరి 12: పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన ఆర్ఎంపీ లక్ష్మీనారాయణ(48) సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత కొంత కాలంగా ఈయన ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ ఉండేవాడు. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. స్థానికులు గమనించి అతడిని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పని చేతకాకపోతే వెళ్లిపోండి

- మండల మీట్‌లో ట్రాన్స్‌కో ఏఈపై ఎంపీపీ ఆగ్రహం



ట్రాన్స్‌కో ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ ఉమాదేవి

యాడికి, ఫిబ్రవరి 12: తాగునీటి సరఫరా సమయంలో కూడా కరెంట్ సరఫరా చేయలేరా మీకు పని చేతకాకపోతే ట్రాన్స్‌ఫర్ చేయించుకొని వెళ్లండి అంటూ ట్రాన్స్‌కో ఏఈ రాజారావుపై ఎంపీపీ ఉమాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ భవనంలో ఎంపీపీ ఉమాదేవి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. వివిధశాఖల అధికారులు వారి ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ట్రాన్స్‌కో ఏఈ రాజారావు మాట్లాడే సమయంలో ఎంపీపీ ఉమాదేవి కరెంట్ కోతలపై నిలదీశారు. యాడికిలో కరెంట్ కోతలు చాలా ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ప్రజలకు తాగునీటి సరఫరా చేసే సమయంలో కూడా కరెంట్ సరఫరా చేయకపోతే ఎలా అని ఆమె ప్రశ్నించారు. మీ నిర్వాకం వల్ల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనికి ఏఈ మాట్లాడుతూ నేను ఇక్కడి నుంచి ట్రాన్స్‌ఫర్ అయ్యానని, ప్రస్తుతం ఇన్‌చార్జ్‌గానే చేస్తున్నానని చెప్పి అక్కడి నుంచి నిష్క్రమించారు. సమావేశంలో ఎంపీడీఓ సావిత్రి, ఈఓపీఆర్డీ వెంకటేష్, ఎంఈఓ కాశప్ప, వైద్యుడు శ్రీరాంకుమార్, ఏఓ మహబూబ్‌బాషా, ఏపీఎం చంద్రశేఖర్, ఏపీఓ రమేష్, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల ద్వారా కందిని కొనుగోలు చేస్తాం

రాయదుర్గం, ఫిబ్రవరి 12: రైతుభరోసా కేంద్రాల ద్వారా కందిపంటను దశల వారీగా కొనుగోలు చేస్తామని ఏడీఏ లక్ష్మానాయక్ పేర్కొన్నారు. పట్టణంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్-2023లో సాగుచేసిన కందిరైతుల నుండి ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందన్నారు. రబీ-2023 ఈ పంట నమోదు కార్యక్రమం ఈనెల 15న ముగుస్తుందని తెలిపారు. రైతులకు అవసరమైన పురుగుమందులను, జింక్, జిప్సం రైతుభరోసా కేంద్రాల ద్వారా అందిస్తామన్నారు. రైతులు ముందస్తుగా తమ పేర్లను రైతుభరోసా కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. మార్చి నెలలో పీఎం కిసాన్ 16వ విడత నిధులు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. రైతులకు టార్పాలిన్‌లు, బిందుసేద్యం పరికరాలు, సబ్సిడీలు అందించాలని వ్యవసాయ సలహామండలి సభ్యులు కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత శిబిరానికి విద్యార్థిని ఎంపిక

ఉరవకొండ, ఫిబ్రవరి 12: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి శిరీష జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికైంది. ఈ నెల 20 నుంచి 26 తేదీ వరకూ కర్ణాటక రాష్ట్రం బెళగావి జిల్లా ఖానాపూర్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటుందని ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. ఇప్పటికే ఈ విద్యార్థిని రాష్ట్ర, జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిందన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

కూడేరు, ఫిబ్రవరి 12: మండలంలోని కొర్రకోడు గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. జిల్లా కేంద్రంలో సోమవారం పయ్యావుల శ్రీనివాసుల సమక్షంలో బోయ సూరి, వడ్డే ధనుంజయ్య, కోతి విజయ్, కోతి శంకర్, కోయిల ధనుంజయ్య తదితరులు పార్టీలో చేరారు.

తొండపాడులో టెంకాయల వేలం

గుత్తిరూరల్, ఫిబ్రవరి 12: మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథ స్వామి దేవాలయంలో సోమవారం టెంకాయల వేలం పాటను ఆలయం ఈవో దేవాదాసు, ఇన్‌స్పెక్టర్ ఆధ్వరంలో నిర్వహించారు. ఈ నెల 18 నుంచి 26 వరకు 9 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలకు కడప జిల్లా ప్రొద్దుటూరుకి చెందిన సరస్వతి రూ. 4.22 లక్షలకు వేలం పాడింది. ఫిబ్రవరి 27 నుంచి ఏడాది పాటు టెంకాలు అమ్ముకోవడానికి నిర్వహించిన వేలాన్ని కడప జిల్లా ప్రొద్దుటూరుకి చెందిన నవీన్ రూ. 5.78 లక్షలకు సొంతం చేసుకున్నారు.

బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, జనవరి 12: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీటెక్ పరీక్షల ఫలితాలను సోమవారం విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ కేశవరెడ్డి, సీఈ ప్రొఫెసర్ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ద్వితీయ సంవత్సరం ప్రథమ, ద్వితీయ సెమిస్టర్(ఆర్15,19)తోపాటు ద్వితీయ సెమిస్టర్(ఆర్20) సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేసినట్లు తెలిపారు. ద్వితీయ సంవత్సరం ప్రథమ, ద్వితీయ సెమిస్టర్ (ఆర్15) లాస్ట్ చాన్స్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల చేశామన్నారు. విద్యార్థులు వారి ఫలితాల కోసం www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

బాధ్యతలు చేపట్టిన ఏఆర్ ఏఎస్పీ

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 12: జిల్లా ఏఆర్ విభాగం నూతన అదనపు ఎస్పీగా లక్ష్మీనారాయణరెడ్డి బాధ్యతలు చేపట్టారు. 1992 బ్యాచ్‌కు చెందిన ఈయన వివిధ హోదాలలో అనంతపురం, చిత్తూరు, కర్నూలు, తిరుపతి జిల్లాల్లో పనిచేశారు. అనంతరం జిల్లా ఎస్పీ అన్బురాజన్‌ను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

అభివృద్ధి కావాలంటే టీడీపీని గెలిపించండి

పెద్దవడుగూరు, ఫిబ్రవరి12: అభివృద్ధి కావాలంటే టీడీపీకి ఓటువేసి గెలిపించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జేసీ అస్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కాశేపల్లి గ్రామంలో సోమవారం జేసీ అస్మిత్‌రెడ్డి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మరోసారి టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన వెంట టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, నాగేశ్వరరెడ్డి, ప్రసాద్‌యాదవ్, రమేష్‌యాదవ్, ముత్యాల్‌రెడ్డి ఉన్నారు.

వెంకటాంపల్లిలో భవిష్యత్తుకు గ్యారెంటీ

యల్లనూరు, ఫిబ్రవరి12: మండలంలోని వెంకటాంపల్లి గ్రామంలో సోమవారం టీడీపీ నాయకురాలు బండారు శ్రావణి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రజల యోగక్షేమాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టీడీపీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమన్నారు. రాష్ట్రం అభివృద్ధి టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోడిమూర్తి మోహన్‌నాయుడు, జనార్దన్‌రెడ్డి, బొప్పేపల్లి రవీంద్రారెడ్డి, వెన్నపూసపల్లె భైరవ, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కేటింగ్ రేంజర్స్‌కు ఘనస్వాగతం

యాడికి, ఫిబ్రవరి12: వరల్డ్ రికార్డు నమోదు కోసం స్కేటింగ్ రేంజర్స్ చేస్తున్న మారథాన్‌కు సోమవారం రాయల చెరువులో ఘనస్వాగతం లభించింది. విశాలాక్షి ఖాదీ సేవా సంస్థ అధ్యక్షుడు నారాయణస్వామి, యాడికి మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు తిరంపురం నీలకంఠ, అంగన్‌వాడీ వర్కర్స్ పార్వతి, పలువురు విద్యార్థులు స్కేటింగ్ రేంజర్స్‌కు ఘనస్వాగతం పలికారు. తాడిపత్రికి చెందిన తరుణ్‌కుమార్, యోగేంద్ర, ఐసాక్, శ్రీరాం, భార్గవ్, పృథ్వీ, రాంచరణ్‌లు వరల్డ్ రికార్డు నమోదు కోసం 750కిలోమీటర్లు రోడ్డు స్కేటింగ్ మారతాన్‌లో పాల్గొన్నారు. తాడిపత్రి నుంచి ప్రారంభమైన వారి స్కేటింగ్ రాయలచెరువు మీదుగా వెళ్లింది.

అప్పుల బాధతో చేనేత కార్మికుడి ఆత్మహత్య



రామాంజనేయులు (ఫైల్)

ధర్మవరం, ఫిబ్రవరి 12: పట్టణంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన చేనేత కార్మికుడు నీలూరి రామాంజనేయులు (50) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం తెల్లవారుజామున కేతిరెడ్డికాలనీ సమీపంలో రైలుకింద పడి ప్రాణం తీసుకున్నాడు. హిందూపురం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... రామాంజనేయులు రెండు మగ్గాలు ఏర్పాటుచేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటుండేవాడు. ఇతడికి భార్య సరోజమ్మ, ముగ్గురు కుమారులు కిరణ్‌కుమార్, పృథ్వీకుమార్, భవానీప్రసాద్ ఉన్నారు. వీరందరికీ వివాహాలు అయ్యాయి. నేసిన చీరకు గిట్టుబాటు ధర లభించక రామాంజనేయులు నష్టపోయాడు. ఈ నేపథ్యంలో ముడిసరుకులు, కుటుంబ అవసరాల కోసం రూ.3.50 లక్షలదాకా అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం కనిపించక ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టాలపై శవాన్ని రైల్వే కీమన్ గమనించి, హిందూపురం రైల్వే పోలీసులకు సమాచారం అందించాడు. హిందూపురం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పేపర్ బ్యాలెట్ వైపే ప్రజలు మొగ్గు



మాట్లాడుతున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 12: పార్లమెంట్, శాసనసభ ఎన్నికలలో పేపర్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయడానికే ప్రజలు మొగ్గు చూపుతున్నారని పలు రాజకీయ పార్టీల నాయకులు పేర్కొన్నారు. స్థానిక అంజుమన్‌వీధిలోని ఏపీ గవర్నమెంట్ పెన్షనర్స్ కార్యాలయంలో సోమవారం జేవీవీ ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధుల ఎంపికలో పేపర్ బ్యాలెట్, ఈవీఎంలు.. ఓటర్ ఎటువైపు అనే అంశంపై చర్చ జరిగింది. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, జైభీమ్, ఆమ్ ఆద్మీపార్టీ, నారాలోకేశ్ ఫౌండేషన్, బీజేపీ, వైసీపీ, జనసేన, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఈవీఎంలు ఉపయోగించడం ద్వారా ట్యాంపర్ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దౌల్తాపురం ప్రభాకర్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు గంగరాజు, సీపీఎం నాయకులు బీ శ్రీనివాసులు, దాసరి శ్రీనివాసులు, వైసీపీ కౌన్సిలర్ సుధాకర్, నారా లోకేశ్ ఫౌండేషన్ అధ్యక్షుడు అశోక్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మా భూమిని కాజేయాలని చూస్తున్నారు

వైసీపీ నాయకుల నుంచి ప్రాణహాని: రామునాయక్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 12: తాను కొనుగోలు చేసిన భూమిని కబ్జా చేసేందుకు తాడిమర్రికి చెందిన ఓ వైసీపీ నాయకుడు, అతడి అనుచరుడు ప్రయత్నాలు చేస్తున్నారని రామునాయక్ ఆరోపించారు. వారి నుంచి తనకు ప్రాణహాని ఉందని వాపోయారు. సోమవారం అనంతపురం నుంచి బైక్‌లో మిత్రుడు నరేష్‌తో కలిసి తాడిమర్రికి వెళ్తుండగా ఉప్పరపల్లి క్రాస్ సమీపంలో ఆటో ఢీకొంది. గాయపడిన రామునాయక్, నరేష్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రామునాయక్ మీడియాతో మాట్లాడుతూ... తాడిమర్రి మండలం నిడిగల్లు గ్రామానికి చెందిన తాను 2021 డిసెంబరులో రూ.29 లక్షలు పెట్టి ఊరి సమీపంలోని 3.84 ఎకరాలు కొనుగోలు చేశానన్నారు. అనంతపురం నగర శివారులోని శిల్పా లేపాక్షి టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్నానన్నారు. ఆ భూమిని కబ్జా చేయడానికి వైసీపీ నాయకుడు, అతడి అనుచరుడు రెవెన్యూ అధికారులను అడ్డం పెట్టుకుని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పంచాయతీలు చేయడానికి పలు సార్లు పిలిచారన్నారు. ఆ భూమిని లాక్కోవడానికి మూడు రోజుల నుంచి పోలీసులతో సైతం ఒత్తిడి పెట్టి పంచాయితీకి పిలుపిస్తున్నారన్నారు. పోలీసులు ఫోన్ చేసి, తన వద్ద ఉన్న డాక్యుమెంట్లు తీసుకురావాలని చెప్పారన్నారు. సోమవారం ఎవరో పోలీసు సిబ్బంది వరుసగా ఫోన్ చేస్తే.. టీవీటవర్ వద్ద వెళ్తున్నానని చెప్పానన్నారు. అనంతపురం వెళ్లి జిరాక్స్ తీసుకుని ఉప్పరపల్లి క్రాస్ సమీపంలో వెళ్తుండగా ఒక ఆటో ఢీ కొందనీ, దీంతో కళ్లు తిరిగి పడిపోయాయన్నారు. సమీపంలో మరో ఆటో ఉండటంతో హత్యాయత్నమేనని అనుమానం వ్యక్తం చేశారు. ఆదివారం తాములేని సమయంలో పొలం వద్దకు వెళ్లిన వైసీపీ నాయకుడి అనుచరుడు 'కంచె తీసేస్తామనీ, ఎవరైనా వస్తే నరుకుతామని' హెచ్చరించినట్లు తెలిసిందన్నారు. వారి నుంచి ప్రాణహాని ఉందని... రక్షణ కల్పించాలని రామునాయక్ కోరాడు.

భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయండి

● టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ పిలుపు

పుట్టపర్తిరూరల్/ ఓబుళదేవరచెరువు/ తనకల్లు, ఫిబ్రవరి 12: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా మండలంలోని గాజులపల్లిలో టీడీపీ కార్యకర్త కుటుంబాన్ని చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి మంగళవారం పరామర్శించనున్నారని, ఆమె పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ పిలుపునిచ్చారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబును వైసీపీ ప్రభుత్వం అక్రమకేసులు బనాయించి 53 రోజులు జైల్లో ఉంచడాన్ని జీర్ణిం చుకోలేక గాజులపల్లికి చెందిన మునిమడుగు బాబయ్య మృతి చెందారని, ఆయన కుటుంబాన్ని పరామర్శించేందుకు భువనేశ్వరి రానున్నారని చెప్పారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలాగే ఓబుళదేవరచెరువు మండలం గాజుకుంటపల్లిలో మేకల రామచంద్ర కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు భువనేశ్వరి రానున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర తెలిపారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు హాజరై ఆమె పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

అదేవిధంగా తనకల్లు మండలం కొర్తికోట గ్రామానికి కూడా భువనేశ్వరి రానున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ తొట్లి రెడ్డి శేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు ఎస్‌కె మస్తాన్‌వలి తెలిపారు. గ్రామంలో ఎస్‌కె బుడన్‌సాబ్ కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారని వివరించారు. మంగళవారం మధ్యాహ్నం 3గంటలకు కొర్తికోటలో ఆమె పర్యటన ఉంటుందన్నారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.


టీడీపీలో చేరిన వారితో కందికుంట వెంకటప్రసాద్

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

కదిరి, ఫిబ్రవరి 12: పట్టణంలోని 34 వార్డులో గల వీవర్సుకాలనీ నుంచి దాదాపు 50కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో సోమవారం వారు టీడీపీలోకి చేరారు. కందికుంట వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారిలో నరసింహులు, వెంకటరమణ, వెంకటేష్, ఆదినారాయణ, వెంకటేష్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే తలుపుల మండలం చదలవాండ్లపల్లి గ్రామంలో 20కుటుంబాల వారు కడప వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరినీ కూడా కందికుంట వెంకటప్రసాద్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రేపు చేనేతలతో భువనేశ్వరి ఆత్మీయ సమావేశం

● విజయవంతం చేయాలని టీడీపీ నాయకుల పిలుపు

ధర్మవరంరూరల్: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడి సతీమణి నారా భువనేశ్వరి ఈ నెల 14వ తేదీన చేనేతలతో ఆత్మీయసమావేశానికి గాను ధర్మవరానికి రానున్నారని, చేనేతలు, టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి సమావేశాన్ని విజయవంతం చేయాలని టీడీపీ పట్టణ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నాయకులు, కార్యకర్తలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఈనెల 14వ తేదీ బుధవారం పట్టణంలోని రాఘవేంద్రకల్యాణమండపంలో నారా భువనేశ్వరి చేనేతలతో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో చేనేతలు పలు సమస్య ల్ని ఆమెకు విన్నవించుకోనున్నారన్నారు. వారిని ఆదుకునేందుకు భువనేశ్వరి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు.


సమావేశానికి హాజరైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

టీడీపీతోనే ముస్లింలకు న్యాయం


ముస్లిం మహిళకు యాసిన్ సూర ఫొటోను అందజేస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 12: టీడీపీతోనే ముస్లింమైనార్టీలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ హిందూపురం పార్లమెంట్ మైనార్టీసెల్ ప్రధాన కార్యదర్శి నాగూర్‌హుస్సేన్ పేర్కొన్నారు. పరిటాల మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో, పరిటాలశ్రీరామ్ సూచనల మేరకు సోమవారం మండలంలోని గొట్లూరు గ్రామంలో ముస్లిం కుటుంబాలకు వారు ఎంతో పవిత్రంగా భావించే యాసిన్‌సూర ఫొటోలను స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముస్లింలకు సంక్షేమపథకాలు అందించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. చంద్రబాబుకు, పరిటాలశ్రీరామ్‌కు ముస్లింలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ముస్లిం మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అత్తార్‌రహీంబాషా, నాయకులు రాళ్లపల్లిషరీఫ్, ఇమాం, మహబూబ్ బాషా, కుళ్లాయప్ప, గొట్లూరు రఫీ, రహీమ్, గొట్లూరు శ్రీనివాసులు, అమరేంద్ర, అనిల్‌గౌడ్, చిరంజీవి పాల్గొన్నారు.

స్పందనకు 280 వినతులు

పుట్టపర్తి, ఫిబ్రవరి 12: జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ లో సోమవారం జరిగిన స్పందనలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ పాల్గొని ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల ప్రజలు పలు సమస్యల పరిష్కారం కోరుతూ సుమారు 280 వినతిపత్రాలు అందజేశారు. అనంతరం జేసీ మాట్లాడుతూ స్పందనలో వినతుల ద్వారా ప్రజలు తెలియజేసిన సమస్యల్ని సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, నోడల్ అధికారి శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 30 వినతులు

పుట్టపర్తిరూరల్: జిల్లాకేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 30 వినతులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు పలు సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రాలను అందజేశారు. వాటిని ఎస్పీ మాధవ రెడ్డి స్వీకరించి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ స్పందనలో ప్రజలు వినతుల ద్వారా తెలిపిన సమస్యల్ని త్వరగా పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. వృద్ధులు వికలాంగుల పట్ల సహృదయంతో వ్యవహరించాలన్నారు. స్పందనలో తెలియజేసిన సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వహించరాదన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, జిల్లాక్రైం బ్రాంచ్ సీఐ సతీష్, లీగల్‌సెల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


జిల్లాపోలీసు కార్యాలయంలో వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

అధికార పార్టీ ఆగడాలకు పోలీసుల అండ

● వివాదాస్పద పోలీసులపై చర్యలు తీసుకోండి

● ఎస్పీకి మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల ఫిర్యాదు

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 12: ధర్మవరం నియోజకవర్గంలో వైసీపీ ఆగడాలకు పోలీసు అధికారులు అండగా నిలుస్తున్నారనీ, వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ.. జిల్లా ఎస్పీ మాధవరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్పీ మాధవ రెడ్డిని సోమవారం కలిసి, ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ధర్మవరం పోలీసులు.. సోషల్ మీడియా నిర్వాహకులను అణచివేసేలా తప్పుడు కేసులు బనాయిస్తున్నారన్నారు. వైసీపీ సోషల్ మీడియా మినహా మరెవరూ పోస్టులు పెట్టరాదంటూ భయభ్రాంతులకు లోనుచేస్తున్నారన్నారు. విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లానన్నారు. అలాంటివి పునరావృతం కాకుండా సంబంధిత పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు ఆయన వివరించారు.



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్నగోనుగుంట్ల సూర్యనారాయణ

జేసీకి వినతి

ధర్మవరంనియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని గోనుగుంట్ల సూర్యనారాయణ.. కలెక్టరేట్‌లో జేసీ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. ధర్మవరం నియోజకవర్గంలో అనేక గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడిందనీ, తక్షణ చర్యలు చేపట్టాలని జేసీకి వివరించినట్లు ఆయన తెలిపారు. అధికారులు అనుమతిస్తే తానే సొంతనిధులతో తాగునీటి సమస్యను పరిష్కరిస్తానన్నారు.

దాడి కేసులో ఇద్దరికి ఏడాది జైలు

కదిరిలీగల్, ఫిబ్రవరి 12 : తనకల్లు మండలం బిసనివారిపల్లిలో వి. సూర్యనారాయణ అనే వ్యక్తిపై దాడి చేసి గాయపరచిన కేసులో ఇద్దరికి కదిరి కోర్టు ఏడాది జైలు శిక్షతో పాటు రూ. 3000 జరిమానా విధించి తీర్పు చెప్పింది. బిసనివారిపల్లికి చెందిన శేషగిరి, వెంకటనారాయణలు సూర్యనారాయణతో ఘర్షణ పడ్డారు. ఈక్రమంలో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. తనకల్లు పోలీసులు ఈ సంఘటనపై 2017 సంవత్సరంలో క్రైమ్ నెంబర్ 20-17 గా కేసు నమోదు చేసుకున్నారు. ఈ కేసుపై కోర్టు వాదోవాదాలు విన్న తరువాత సాక్ష్యాధారాలు పరిశీలించిన అనంతరం న్యాయమూర్తి ఎస్ ప్రతిమ నిందితులకు శిక్ష ఖరారు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ లక్ష్మీసాయి, రామకృష్ణ వాదించారు.

రోడ్డు ప్రమాదం కేసులో ఒకరికి ఆరు నెలలు..

పట్టణంలోని కుటాగుళ్ల రైల్వే గేటు వద్ద కారు, ఆటో ఢీకొన్న ప్రమాదంలో నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష, రూ. 1000 జరిమానా విధిస్తూ కదిరి కోర్టు తీర్పు చెప్పింది. కారును మురళీనాథ్‌రెడ్డి అజాగ్రత్తగా, అతివేగంగా నడపి ఆటో డ్రైవర్ రఘునాథ్‌రెడ్డిని ఢీకొట్టాడు. దీంతో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పట్టణ పోలీసులు 2018లో క్రైమ్ నెంబర్ 53 బార్ 18 కేసుగా నమోదు చేశారు. కదిరి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్. పత్రిమ కేసు పూర్వాపరాలు పరిశీలించి ఈకేసులో ముద్దాయి మురళీనాథ్‌రెడ్డికి సంవత్సరం జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ లక్ష్మీసాయి, రామకృష్ణ హాజరయ్యారు.

అలరించిన భక్తిగీతాలు


భక్తిగీతాలను ఆలపిస్తున్న విద్యార్థులు

పుట్టపర్తి, ఫిబ్రవరి 12 : సత్యసాయి విద్యార్థులు భక్తిగీతాలు ఆలపించి భక్తులను అలరించారు. శ్రీసత్యసాయి హయ్యర్ సెకెండరీ స్టడీస్ విద్యార్థులు విద్యా సంవత్సరం ముగింపు సందర్భంగా సోమవారం పట్టణంలోని ప్రశాంతినిలయంలోగల సాయికుల్వంత్‌హాల్‌లో సోమవారం భక్తిగీతాలు ఆలపించారు. సత్యసాయి ప్రేమ తత్వంపై ఆలపించిన గీతాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం వారు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

ప్రైవేటు స్కూల్ బస్సు ఢీకొని యువకుడికి గాయాలు

తాడిమర్రి, ఫిబ్రవరి 12: ప్రైవేటు పాఠశాల బస్సు ఢీకొని మండలంలోని పిన్నదరి గ్రామానికి చెందిన ముత్యాలు అనే యువకుడు గాయపడ్డారు. ధర్మవరం పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు విద్యార్థులను ఎక్కించుకుని కునుకుంట్ల గ్రామానికి వెళ్తూ.. పిన్నదరి నుంచి ఏకపాదంపల్లికి వెళ్లే దారిలో ముత్యాలును ఢీకొంది. పశుగ్రాసం కోసం ముత్యాలు ద్విచక్రవాహనంలో వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. గాయపడిన ముత్యాలును స్థానికులు బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నాగాస్వామి తెలిపారు.

ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కోనంకి అశోక్‌కుమార్

పుట్టపర్తి/పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 12 : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కోనంకి అశోక్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం విజయవాడలో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో మూడోసారి ఆయన్ను ఉపాధ్యక్షుడిగా నియమించారు. 22సంవత్సరాలుగా ఏపీటీఎఫ్‌లో చేసిన సేవలను గుర్తించి పదవిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. ఆయన నియామకం పట్ల యూనియన్ నాయకులు కోడూరు శ్రీనివాసులు, రామచంద్ర, పీవీ మాధవ్ హర్షం వ్యక్తం చేశారు.

ఒకరు చేరితే.. 20 కుటుంబాలు అంటారా..?

కొత్తచెరువు, ఫిబ్రవరి 12: మండలంలోని మైలసముద్రం గ్రామానికి చెందిన ఒక టీడీపీ కార్యకర్త వైసీపీలోకి 10 రోజుల క్రితం చేరాడని, అయితే స్థానిక ఎమ్మెల్యే, ఆయన భజన పరులు 20 కుటుంబాలు చేరినట్టు వారి సొంత పత్రికలో రాయిచుకోవడం సిగ్గుచేటని టీడీపీ నాయకుడు కిలారిశ్రీనాథ్ ఎద్దేవా చేశారు. మైలసముద్రం గ్రామంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మైలసముద్రం గ్రామానికి చెందిన అసమ్మతి కార్యకర్త ఒకరు వైసీపీలో చేరారని, ఆయన వల్ల టీడీపీకి ఒరిగిందేమీలేదని అన్నారు. అలాంటి వారిని ఎమ్మెల్యే చేర్చుకుని 20 కుటుంబాలు చేరినట్టు అబద్ధపు రాతలు రాయించుకోవడం సిగ్గుచేటని అన్నారు. కార్యక్రమంలో నాయకులు వడ్ల చంద్ర, సోమశేఖర్,మాధవనాయుడు, వడ్లగంగప్ప, బెల్లం చలపతి, లింగమయ్య పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి పరామర్శ

బుక్కపట్నం, ఫిబ్రవరి 12: మండలకేంద్రానికి చెందిన టీడీపీ కార్యకర్త చంద్ర అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి సోమవారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి అండ గా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట నాయకులు లావణ్యగౌడ, రెడ్డికేశి, మంజు తదితరులు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 12: కదిరి తహసీల్దార్‌గా పుల్లారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇతను అన్నమయ్యజిల్లా ఓబులవారిపల్లి తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై కదిరికి వచ్చారు. ఆయనకు డిప్యూటీ తహసీల్దార్ సునిత, సిబ్బంది పుష్పగుచ్ఛాలందించి స్వాగతం పలికారు.

ఓడీసీ తహసీల్దార్‌గా ఖాజాబీ

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 12: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నూతన తహసీల్దార్‌గా ఖాజాబీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ రామనాథ్‌రెడ్డి అమడగూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అన్నమయ్య జిల్లా గుర్రంకొండ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఖాజాబీ వచ్చారు. ఆమెకు డిప్యూటీ తహసీల్దార్ జాకీర్, ఆర్ఐ నాగేంద్ర, వీఆర్‌ఓలు పుష్పగుచ్ఛాలందజేసి అభినందనలు తెలిపారు.

గాండ్లపెంట తహసీల్దార్‌గా శ్రావణి

గాండ్లపెంట, ఫిబ్రవరి 12: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నూతన తహసీల్దార్‌గా శ్రావణి బాధ్యతలు స్వీకరించారు. ఆమె అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆమెకు సిబ్బంది పుష్పగుచ్ఛాలందించి స్వాగతం పలికారు.

పాఠశాలకు జిరాక్స్ మిషన్ వితరణ

నంబులపూలకుంట, ఫిబ్రవరి 12: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు విజయా బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగి గంగిరెడ్డి జిరాక్స్ మిషన్‌ను సోమవారం హెచ్‌ఎం శిరీషకు అందజేశారు. మండల కేంద్రానికి చెందిన గంగిరెడ్డి ఇదే పాఠశాల పూర్వ విద్యార్థి. తాను చదువుకున్న పాఠశాలకు తన వంతు సాయంగా జిరాక్స్ మిషన్‌ను వితరణ చేసినట్లు ఆయన చెప్పారు. ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో భవిష్యత్తుకు గ్యారెంటీ

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి 12: మండలంలోని చిన్నూరుబత్తలపల్లి, దర్శినమల గ్రామాల్లో సోమవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి మినీమేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేసి వాటి పథకాల గురించి వివరించారు. అనంతరం మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయితే అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. సంక్షేమ పథకాలు అందరికీ అందుతాయని పేర్కొన్నారు. అలాగే గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించేందుకు పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ విన్నూత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదులను చైతన్యరథంలో ఉన్న ఫిర్యాదుల బాక్సులో వేయాలని సూచించారు. ఈ సమస్యలన్నీ పరిటాల శ్రీరామ్ దృష్టికి వెళతాయన్నారు. అప్పుడు ఆయన వాటిని పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో కన్వీనర్ పోతుకుంటలక్ష్మన్న, నాయకులు గొట్లూరుశ్రీనివాసులు, విజయసారథి, రాఘవరెడ్డి, తెలుగు యువత విజయ్‌చౌదరి, భాస్కర్‌చౌదరి, జంగంనరసింహులు, తలారివెంకటలక్ష్మీపోతలయ్య, అమరా సుధాకర్, గుత్తాసూరి తదితరులు పాల్గొన్నారు.


ధర్మవరం మండలం చిన్నూరుబత్తలపల్లిలో భవిష్యత్తుకు గ్యారెంటీలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు

ముదిగుబ్బ: మండలంలోని పీసీరేవు, హుస్సేనుపురం గ్రామాలలో సోమవారం టీడీపీ శ్రేణులు బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు మినీమేనిఫెస్టో కరపత్రాలను పంచుతూ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కరణంప్రభాకర్, నాయకులు మహబూబ్‌పీరా, ఆనంద్, గురప్ప, పక్కృద్దీన్, మునయ్య, తిప్పన్న, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : మండలంలోని దంపెట్ల గ్రామంలో టీడీపీ శ్రేణులు బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిచారు. ఈ సందర్భంగా ఇంటింటికీ మినీమేనిఫెస్టో పథకాలను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చల్లా శ్రీనివాసులు, నాయకులు నారాయణరెడ్డి, గంటాపురంజగ్గు, సాంబ, ఉమపతినాయుడు, సురేంద్రనాయుడు, చితంబర్‌రెడ్డి, కిష్టయ్య, రవి, నారాయణస్వామి పాల్గొన్నారు.


ముదిగుబ్బ మండలం పీసీరేవులో కరపత్రాలు పంచుతున్న టీడీపీ శ్రేణులు


బత్తలపల్లి మండలం దంపెట్లలో..

వేతనాలివ్వాలని స్వచ్ఛభారత్ కార్మికుల ధర్నా

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 12: తమకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే మంజూరు చేయాలని కోరుతూ మండలంలోని స్వచ్ఛభారత్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో సోమవారం ధర్నా చేపట్టారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో సీఐటీయూ మండలఅధ్యక్ష కార్యదర్శులు కుళ్లాయప్ప, శ్రీరాములు పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛభారత్ కార్మికులకు ఏడాదిగా వేతనాలు రాలేదని, దీంతో వారి పరిస్థితి కష్టతరంగా ఉందని అన్నారు. పెండింగ్ జీతాలు ఇవ్వాలని పలుమార్లు అధికారులను కోరినా.. ఫలితం లేకపోయిందన్నారు. మంగళవారం కార్మికులు జీతాల కోసం నుంచి రిలేదీక్ష చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం ఎంపీడీఓకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కార్మికులు లక్ష్మీనారాయణ, అంజనప్ప, రత్నమ్మ, ఉమాదేవి, గంగులమ్మ, రమేష్, బాబు, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ముదిగుబ్బ, ఫిబ్రవరి12: మండలంలోని బోడన్నకొట్టాల సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నాగులగుబ్బల గ్రామానికి చెందిన వెంకట నారాయణ, కదిరి మండలం కుటాగుళ్లకు చెందిన కిష్టప్ప బోడన్నకొట్టాల సమీపంలో రోడ్డు పక్కన మాట్లాడుకుంటున్నారు. అయితే ముదిగుబ్బ వైపు నుంచి బోడన్న కొట్టాల వైపునకు బైక్‌లో వస్తున్న సురేష్, నాగప్ప వారిని ప్రమాదవశాత్తూ ఢీకొట్టారు. ప్రమాదంలో రోడ్డు పక్కన ఉన్న వెంకటనారాయణ, కిష్టప్పతో పాటు బైక్‌లో ప్రయాణిస్తున్న సురేష్, నాగప్పలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రుల ను 108 వాహనం ద్వారా బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు.

ఓటర్ల జాబితాను సరి చేయాలని వినతి

ముదిగుబ్బ, ఫిబ్రవరి12: మండలంలో ఓటర్ల తుది జాబితా తప్పుల తడకగా ఉందని, తక్షణమే సరి చేయాలని సీపీఐ మండల నాయకులు తహసీల్దార్ సరస్వతికి వినతిపత్రం అందించారు. మండలకేంద్రంలో సోమవారం వారు తహసీల్దార్‌ను కలిసి వినతిని ఇచ్చారు. పార్టీ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠలో కందికుంట

తనకల్లు, ఫిబ్రవరి 12: మండలంలోని టి.సదుం గ్రామంలో గల రామాలయంలో సోమవారం శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. ఇందులో కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. అలాగే మండలంలోని కొక్కంటి క్రాస్‌లో కొండా కుటుంబ నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. తర్వాత కందికుంటను కొండా కుటుంబ సభ్యులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఆయనవెంట పలువురు నాయకులు ఉన్నారు.

మార్కండేయుడి ఆలయంలో ప్రత్యేక పూజలు

నల్లచెరువు, ఫిబ్రవరి 12: మండలకేంద్రంలోని గీతామందిరం సమీపంలో నూతనంగా నిర్మించిన మార్కండేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను సోమవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంటకప్రసాద్ హాజరై పూజల్లో పాల్గొన్నారు. తొలుత ఆలయ కమిటీ సభ్యులు కందికుంటకు ఘన స్వాగతం పలికి, పూలమాలలు, దుశ్శాలువాతో సన్మానించారు. అనంతరం కందికుంట మార్కండేయుడికి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజశేఖర్, నాయకులు అంజనప్ప, లక్ష్మీనారాయణ, సూర్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి నియంతలా వ్యవహరించడం తగదు: బీకే


మాట్లాడుతున్న బీకే పార్థసారథి

గోరంట్ల, ఫిబ్రవరి 12: మంత్రి ఉషశ్రీ చరణ్ నియంతలా వ్యవహరించడం తగదని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పార్థసారధి అన్నారు. సోమవారం గోరంట్ల పర్యటన సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. సోమందేపల్లిలో జరిగిన ఆసరా కార్యక్రమంలో హాజరు కాని డ్వాక్రా మహిళలకు నిధులు ఆపివేస్తామని, తప్పకుండా వచ్చి సంతకం పెట్టాలని బెదిరించడం పట్ల ఆయన తీవ్రంగా స్పందించారు. మంత్రి అయితే బెదిరిస్తారా, ఎవరూ భయపడవద్దని రెండునెలల్లో కొత్తప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రాకళ్యాణదుర్గం నుంచి ఇక్కడకు ఇసుక కొల్లగొడుదామని వచ్చావు. నీ దోపిడీ సాగదు. రానున్న ఎన్నికల్లో ప్రజలు సరైన గుణపాఠం చెప్పి, నిన్ను మళ్లీ బెంగళూరుకు తరుముతారన్నారు. ఆయనతోపాటు మండల కన్వీనర్ సోముశేఖర్, పలువురు నాయకులున్నారు.

టీడీపీలోకి కొనసాగుతున్న వలసలు


వైసీపీ నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న గుండుమల

మడకశిర టౌన్, ఫిబ్రవరి12: నియోజకవర్గంలో వైసీపీని వీడి టీడీపీలోకి భారీ ఎత్తున చేరుతున్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో హరేసముద్రం పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల నుంచి 35 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. వైసీపీకి చెందిన శశికుమార్, నాగరాజు, నరసయ్య, మల్లేష్, కదురప్ప, మోహన్, హనుమంతరాయప్ప, తిమ్మప్ప, నరసప్ప, లక్ష్మమ్మ, సుమిత్రమ్మ, హనుమక్క, పార్వతమ్మతోపాటు పలువురు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలోకి చేరారు. వారికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పార్టీ కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానించారు.

బాధిత కుటుంబాలకు టీడీపీ అండ

గుడిబండ: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబు అక్రమ అరెస్టుపై టీవీలో చూస్తూ టీడీపీ కార్యకర్త గుండెపోటుతో మృతిచెందిన ముత్తప్ప కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అరాంరకె, సోమవారం మండలంలోని దిన్నెహట్టి గ్రామానికి చెందిన ముత్తప్ప గుండెపోటుతో మృతిచెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి టీడీపీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస మూర్తి, మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, నాయకులు షబ్బీర్, దుర్గేష్, సన్నమారప్ప, రవిస్వామి, లక్ష్మీనరస్ప పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి భిక్షాటన


భిక్షాటన చేస్తున్న కౌన్సిలర్ భర్త నాగేంద్ర

హిందూపురం, ఫిబ్రవరి 12: వార్డులో తాగునీరు సరఫరా చేసే స్టార్టర్ మరమ్మతులకు గురైందని, ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో టీడీపీ నాయకుడు వాటి మరమ్మతుల కోసం భిక్షాటన చేపట్టాడు. పట్టణంలోని 37వ వార్డు టీడీపీ కౌన్సిలర్ మహాలక్ష్మీ భర్త కోరుముట్ల నాగేంద్ర సోమవారం ఆ వార్డు ఇళ్లకు వెళ్లి జోలెపట్టి అడుక్కున్నాడు. ఆయన మాట్లాడుతూ వార్డు పరిధిలో ఉన్న బోరు మోటారు, స్టార్టరు మరమ్మతులకు గురయ్యాయి. పలుమార్లు మున్సిపల్ అధికారులకు చెప్పినా స్పందించలేదు. ఒకటి రెండు సార్లు సొంత నిధులతోనే మరమ్మతులు చేయించాం. అయినా అలాగే ఉండటంతో కొత్త మోటారు, స్టార్టరు వేయాలని కౌన్సిల్ సమావేశాల్లో విన్నవించాం. అయినా అధికారులు స్పందించలేదు. చేసేది లేక తమ వార్డులోని ఇళ్లవద్దకు వెళ్లి భిక్షాటన చేస్తున్నా. వచ్చిన మొత్తంతోపాటు తాను కొంత వేసి కొత్త మోటారు, స్టార్టరు ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, మునిసిపల్ అధికారులు కళ్లు తెరవాలన్నారు.

రెండు కులాల పాలన పోవాలి


పోస్టర్‌లు విడుదల చేస్తున్న బీఎస్పీ నాయకులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 12: రాష్ట్రంలో రెండు కులాల పాలన పోయి బహుజనుల పాలన రావాలని బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాములు అన్నారు. సోమవారం స్థానిక అబాద్‌పేటలోని బీఎస్పీ కార్యాలయం వద్ద పోస్టర్‌లు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటి నుంచి రెడ్లు, కమ్మ కులాలవారే పాలిస్తున్నారన్నారు. ఆ రెండు కులాలు అధికారం చెలాయిస్తూ బడుగుబలహీన పేద ప్రజలు బీసీలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రాజ్యాధికారం అందకుండా చేస్తున్నారని ఆగ్రహించారు. సాధికారత పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారే తప్పా అధికారం ఇవ్వడంలేదన్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా అగ్రకులాల వారే పాలిస్తున్నారన్నారు. ప్రజల్లో మార్పు రావాలని బహుజనులకు రాజ్యాధికారం రావాలంటే అందరూ సంఘటితమవ్వాలన్నారు. జిల్లాకోశాధికారి హరికుమార్, హిందూపురం శాఖ అధ్యక్షుడు నాజీమ్‌బాష్, ఉపాధ్యక్షుడు సుబ్బరాయప్ప, పట్టణాధ్యక్షుడు దాసరి ఈశ్వర్య, నాయకులు నారాయణ, సడ్లపల్లి నారాయణప్ప, మౌలాలి, బాబు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేత కర్ణాటక రక్షణ వేదిక


విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న సుజిత్

పావగడ, ఫిబ్రవరి 12: పావగడ సూపర్ ప్రీమియర్ లీగ్ సీజన్ త్రీ టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో కర్ణాటక రక్షణ వేదిక టీమ్ మొదటి బహుమతి దక్కించుకొంది. స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో మూడు రోజులపాటు న్యూ అంజన్ క్రీడా యువక సంఘం కర్ణాటక ప్రభుత్వ నౌకర్ల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో పదిజట్లు పాల్గొనగా కర్ణాటక రక్షణ వేదిక స్టైలిష్ జట్లు ఫైనల్‌లో తలబడ్డాయి. కర్ణాటక రక్షణవేదిక జట్టు విజయం సాధించగా రూ.2లక్షలు, ట్రోఫీని తిరుమణిలోని సిద్ధార్థ సోలార్ కన్‌స్ట్రక్షన్ సూపర్‌వైజర్ బత్తినేని నాని తరఫున బత్తినేని సుజిత్ అందజేశారు. రెండో బహుమతిగా రూ.లక్ష, ట్రోఫీని స్టైలిష్ జట్టుకు సంఘం అధ్యక్షుడు అంజన్ తిమ్మరాజు అందజేశారు. అలాగే మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్, మ్యాన్‌ఆఫ్‌ది సిరీస్‌ను మేనేజర్ ఆలుకుందరాజు, రఘు, దాదాశీనప్ప, హరీష్, లోకేష్, హనుమంతరాయప్ప అందజేశారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, ఫిబ్రవరి 12: మండలంలోని వానవోలు గ్రామానికిచెందిన ప్రమీల అనే మహిళ కుటుంబ కలహాలతో సోమవారం ఆత్మహత్యకు యత్నించింది. వానవోలు గ్రామానికి చెందిన చంద్రబాబు భార్య ప్రమీల కుటుంబ సమస్యలతో మనస్థాపానికి గురై జీవితంపై విరక్తి చెంది ఇంటిలోని పైకప్పుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించిందని గ్రామస్థులు తెలిపారు. కుటుంబ సభ్యులు గుర్తించి ఆమెను రక్షించారు. అస్వస్థతకు గురైన ఆమెను గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా డాక్టర్ ఉషా చికిత్సలు అందించి, మెరుగైన వైద్యంకోసం 108లో హిందూపురం తరలించారు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య


అఖిల (ఫైల్)

గోరంట్ల, ఫిబ్రవరి 12: మండలంలోని పుల్లగూర్లపల్లికి చెందిన బీటెక్ విద్యార్థిని అఖిల(20) తమిళనాడులోని కళాశాలలో సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. పుల్లగూర్లపల్లికి చెందిన గోపాల్, లలితమ్మ దంపతులకు కుమార్తె అఖిల, కుమారుడు హరీష్ ఉన్నారు. కుమార్తె తమిళనాడు రాష్ట్రం మధురై సమీపంలోని కళాశలింగ ఇంజనీరింగ్ కళాశాలలతో బీటెక్ రెండో సంవత్సరం చదువుతోంది. కళాశాల యజమాన్యం.. అఖిల తల్లిదండ్రులకు సోమవారం ఫోన్ చేసి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం ఇచ్చారు. వారు తమిళనాడు బయలు దేరి వెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. విద్యార్థిని ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

రేపు పెనుకొండకు నారా భువనేశ్వరి రాక

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి

పెనుకొండ, ఫిబ్రవరి 12: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు బనాయించి అరెస్టుచేసి జైలుకు పంపడాన్ని జీర్ణించుకోలేక గుండెపోటుతో ఆకస్మిక మృతిచెందిన కార్యకర్తల కుటుంబ సభ్యులను పరామర్శించడానికి 14వ తేదీన నారా భువనేశ్వరి పెనుకొండకు రానున్నట్లు జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారధి తెలిపారు. సోమవారం పెనుకొండ పార్టీ కార్యాలయంలో భువనేశ్వరి పర్యటనపై మండల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును జీర్ణించుకోలేక పట్టణంలోని దర్గాపేటకు చెందిన టీడీపీ అభిమాని ఆర్‌ఆర్ రహీమ్ గుండెపోటుతో మృతిచెందాడన్నారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించడానికి 14న సాయంత్రం 5గంటలకు చంద్రబాబు సతీమణి భువనేశ్వరి నిజం గెలవాలి అనే కార్యక్రమంలో రహిమాన్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం చెక్కును అందిస్తారన్నారు. అనంతరం బీకే మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి అధైర్య పడకండి టీడీపీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షులు సుబ్బరత్నమ్మ, మునిమడుగు వెంకటరాముడు, యాదవ సంఘం కేశవయ్య, కన్వీనర్‌లు రవిశంకర్, సిద్దయ్య, సిద్దలింగప్ప, గొల్లపల్లి బాబుల్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, జనసేన లోకేష్, రాజేష్, కన్నా, వడ్డి నాగప్ప, షీప్‌ఫార్మర్ చంద్ర, ప్రభంజన్‌కుమార్, జెరాక్స్ శీన, వెంకటేశ్, నజీర్, సానిపల్లి సూరీ, షమున్, తదితరులు పాల్గొన్నారు.


మడకశిరలో మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్: ఎన్‌టీఆర్ ట్రస్టు చైర్‌పర్సన్ భువనేశ్వరి 15వ తేదీన నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా గుడిబండ మండలం దిన్నేహట్టి గ్రామంలో పర్యటిస్తున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి తెలిపారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పార్టీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టును జీర్ణించుకోలేక గుండెపోటుతో మరణించిన టీడీపీ వీరాభిమాని ముత్తప్ప కుటుంబాన్ని పరామర్శించేందుకు భవనేశ్వరి వస్తున్నట్లు తెలిపారు. ఏర్పాట్లపై నాయకులు, కార్యకర్తలతో చర్చించి వారి సలహాలు సూచనలు తీసుకొన్నారు.


మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బీకే పార్థసారథి, టీడీపీ నాయకులు

పెనుకొండ టౌన్: చంద్రబాబు అక్రమ అరెస్టు నేపథ్యంలో మనస్థాపానికి గురై మృతిచెందిన ఆర్‌ఆర్ రహీమ్ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు బుధవారం పెనుకొండకు నారా భువనేశ్వరి వస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహకకార్యదర్శి సవిత తెలిపారు. సోమవారం స్థానిక సవిత కార్యాలయంలో రహీమ్ కుటుంబ సభ్యులతో విషయాన్ని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.


మాట్లాడుతున్న సవిత

ఇళ్లస్థలాల కోసం గ్రామస్థుల ధర్నా


తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పాలసముద్రం వాసులు

గోరంట్ల, ఫిబ్రవరి 12: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో పాలసముద్రం గ్రామస్థులు ఇళ్లస్థలాలకోసం సోమవారం ధర్నా చేపట్టారు. పాలసముద్రం జాతీయ రహదారి కూడలిలోని ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకున్నవారు నిర్మాణ విషయంలో, మిగిలినవారికి ఇళ్లపట్టాలు, అనుభవ హక్కు పత్రాలు ఇవ్వాలని ఆందోళన చేశారు. గుడిసెవాసులకు కనీస వసతులు కల్పించాలని కోరుతూ, ఆన్‌లైన్‌కాని దరఖాస్తులను వెంటనే చేయాలని, ప్రజలపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వీఆర్‌ఓపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ అక్మల్‌బాషాకు వినతిపత్రం అందించారు. తాను నూతనంగా వచ్చానని, పరిశీలించిచర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం హనుమయ్య, వెంకటేష్, కొండా వెంకటేష్‌లు, ఇళ్లస్థలాల సాధన కమిటీ సభ్యులు అంజలి, అశ్వనీ, వజీర్, వెంకటలక్ష్మమ్మ, అచ్చమ్మ, లక్ష్మీదేమ్మ, అశ్వర్థమ్మ, శాతాజ్, స్వర్ణలత, ప్యారీమా, నారాయణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

భూములు తిరిగివ్వాలని రైతుల ఆందోళన


తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న రైతులు

మడకశిరటౌన్, ఫిబ్రవరి 12: మండలంలోని సి.కొడిగేపల్లి పరిధిలో పరిశ్రమల కోసం తీసుకున్న భూములు తిరిగివ్వాలని సోమవారం రైతుసంఘంనాయకులు, రైతులు మడకశిర తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ 12 ఏళ్లు గడిచినా పరిశ్రమలు నెలకొల్పలేదని, ఇటు ఉపాధి లేక అటు భూములు లేక రైతులు నష్టపోతున్నారన్నారు. కొన్ని సంవత్సరాలపాటు పరిశ్రమలు నెలకొల్పాలని లేనిపక్షంలో తమభూములు తమకే ఇవ్వాలని అధికారులను కలిసి కోరుతున్నా స్పందన లేకుండా పోవడం బాధాకరం అన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులుకు వినతిపత్రాన్ని అందజేశారు. రైతులకు మద్దతుగా టీడీపీ మైనారిటీ అధ్యక్షుడు భక్తర్, పట్టణ అధ్యక్షుడు మనోహర్, రైతు సంఘం నాయకుడు వెంకటరంగారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన

పెనుకొండ, ఫిబ్రవరి 12: స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో స్థానిక నారాయణమ్మ కాలనీలో నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. సోమవారం విద్యార్థులు బ్యానర్లు, ప్లకార్డులుపట్టుకుని కాలనీలో ర్యాలీ చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు మాట్లాడుతూ దోమల ద్వారా రోగాలు వ్యాపించకుండా దోమతెరలు వాడటం, మురుగుకాలువలను శుభ్రంగా ఉంచడం తదితర కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు డా.జయప్ప, రంగనాయకులు, డా.హరీష్‌బాబు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రికి ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు


ఆస్పత్రి పరిసరాలను పరిశీలిస్తున్న ప్రపంచబ్యాంకు ప్రతినిధులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 12: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు సోమవారం వచ్చారు. ఆస్పత్రిలో వైద్య సదుపాయాలు ఎలా ఉన్నాయి, అభివృద్ధికి కేటాయించిన నిధులు దేనికి ఉపయోగించారు, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. తెనాలి, పార్వతీపురం, ఆస్పత్రులను కూడా పరిశీలించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రోహిల్, ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు తుషార్, శ్రీక్షి దీవాన్, ఆర్ఎంఓ రుక్మిణమ్మ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మా భూమిని ఆక్రమించుకున్నారు

పెనుకొండ టౌన్(సోమందేపల్లి), ఫిబ్రవరి 12: ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని అధికారపార్టీకి చెందిన వ్యక్తులు కబ్జా చేశారని, న్యాయం చేయాలని బాధితులు శంకర, భార్య జానకమ్మ తహసీల్దార్ అంజనాదేవికి సోమవారం వినతిపత్రం అందించారు. బాధితులు మాట్లాడుతూ సోమందేపల్లి గ్రామం నక్కలగుట్టవద్ద ఇందిరమ్మ ఆదర్శ కాలనీలో 2010లో రెండు సెంట్ల స్థలం ఇచ్చారని, పరిస్థితి బాగాలేక నిర్మాణ పనులు చేపట్టలేదన్నారు. ప్రస్తుతం అధికార పార్టీకి చెందిన వ్యక్తులు తమకు చెందిన స్థలంలో నిర్మాణ పనులు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నిస్తే నీవు ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకోమని బెదిరిస్తున్నారన్నారు. కబ్జాకు గురైన స్థలాన్ని ఇప్పించాలని వారు కోరారు. వీరికి మద్దతుగా సీపీఐ మండల కార్యదర్శి బాలస్వామి పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి

మడకశిరటౌన్, ఫిబ్రవరి 12: గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని 32 గ్రామాలకు చెందిన గ్రామ పెద్దలు సోమవారం పట్టణంలో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల వద్ద వినతిపత్రాలను అందజేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓఆర్‌డీ శైలజ, తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులుకు తమ సమస్యలు విన్నవించారు. ఎ.ఆర్.రొప్పం, బేగార్లపల్లి, వై.బి.హళ్లి, జిల్లెడిగుండ, గోవిందాపురం, ఎం.గొల్లహట్టి, టి.డి.పల్లి, బుళ్లసముద్రం తదితర గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

గ్రీవెన్స్‌లో ఖాళీ కుర్చీలు


రెవెన్యూ కార్యాలయంలో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

రొద్దం, ఫిబ్రవరి 12: ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌సెల్‌కు అధికారులు గైర్హాజరు కావడంతో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో అధికారులు కొంతమంది తూతూ మంత్రంగా హాజరై సంతకాలు పెట్టి వెళ్లిపోయారన్న విమర్శలున్నాయి. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్‌సెల్‌కు విచ్చేసి ఫిర్యాదు చేస్తుంటారు. అయితే సంబంధిత శాఖాధికారులు కొంతమంది హాజరై సంతకాలు పెట్టి వెళ్లిపోయారన్న విమర్శలున్నాయి. తహసీల్దార్ లక్ష్మీనారాయణ, అధికారుల అనుమతితో బయటకు వెళ్లగా ఇన్‌చార్జి ఎంపీడీఓ కేశవరెడ్డి సర్పంచుల బిల్లుల పనిపై వెళ్లగా వ్యవసాయాధికారి శంకర్‌నాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ, ఏఈ ఖాజామోయినుద్దీన్ రిజిసరులో సంతకాలు పెట్టి వెళ్లిపోయారు. మిగిలినశాఖాధికారులు డుమ్మాకొట్టారన్న విమర్శలున్నాయి.

మరోచోట ఇంటి స్థలాలు చూపించాలి

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 12: సోమందేపల్లి మండలంలోని వెలుగమాకులపల్లి తండాలో ఉన్న గిరిజన కుటుంబాలు భయభ్రాంతులకు గురవుతున్నాయని, మరోచోట ఇంటి స్థలాలు చూపించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏఓకు గ్రామస్థులతో కలిసి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ తండాలో 60గిరిజన కుటుంబాలు నివాసముంటున్నాయని, పది కిలోమీటర్ల దూరంలో కొండ, గుట్టల మధ్య ఏమాత్రం రాకపోకలకు దారిలేకుండా నివాసముంటున్నారన్నారు. విద్యా, వైద్యం తదితర సౌకర్యాలు అందుబాటులో లేవన్నారు. ప్రమాదవశాత్తు బయట ప్రాంతంలో మృతిచెందితే తండాలోకి తీసుకురావడానికి ఇబ్బందులున్నాయన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రజాప్రతినిధులు వస్తారుకాని మళ్లీ కన్నెత్తి చూడరన్నారు. సబ్ కలెక్టర్ స్పందించి మా తండాను పరిశీలించి న్యాయం చేయాలన్నారు. పెద్దన్న, వెంకటరాముడు, తిప్పన్న, గ్రామస్థులు దేవీబాయి, కవితాబాయి, ప్రభావతి, నర్మలబాయి, మంజుళబాయి పాల్గొన్నారు.


సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారికి వినతిపత్రం ఇస్తున్న తండావాసులు

గిరిజన తండాల్లో సౌకర్యాలు కల్పించండి

గోరంట్ల: మండలంలోని గిరిజన తండాల్లో కనీస వసతులు కల్పించాలని ఆల్ ఇండియా బంజార సేవా సంఘం నాయకులు తహసీల్దార్ అక్మల్ బాషాను సోమవారం కోరారు. మండలంలో గిరిజన తండాలు అధికంగా ఉన్నాయని, రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. బంజార సేవా సంఘం నాయకులు రవినాయక్, బాలునాయక్, వసంతనాయక్, గణేనాయక్, పరమేశ్‌నాయక్, రమేష్‌నాయక్, శ్రీనివాస్‌నాయక్, కృష్ణనాయక్, అకలేనాయక్ పాల్గొన్నారు.

ఆసరా కార్యక్రమానికి బలవంతపు తరలింపు

● మంత్రి ప్రసంగం కాకనే మెనుదిరిగిన మహిళలు


మంత్రి ప్రసంగం ప్రారంభంకాకనే వెళ్లిపోతున్న మహిళలు

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 12: మంత్రి కార్యక్రమానికి రాకపోతే ఆసరా కట్ అవుతుందని యానిమేటర్లు, వెలుగు అధికారులు ఒత్తిళ్లు చేసి డ్వాక్రా మహిళలను కార్యక్రమానికి తరలించే పరిస్థితి నెలకొంది. మంత్రి కార్యక్రమంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో చంటి బిడ్డలతో వచ్చిన తల్లులు నానా అగచాట్లు పడ్డారు. పట్టణంలో మంత్రి ఉశశ్రీచరణ్ ఆధ్వర్యంలో సోమవారం వైఎస్‌ఆర్ ఆసరా చెక్కులు పంపిణీని నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచే ఆయా గ్రామాల్లోని డ్వాక్రా మహిళలకు యానిమేటర్లు, వెలుగు సీసీలు చేరుకుని మంత్రి పర్యటనకు రావాలని లేకపోతే ఆసరా డబ్బులు కట్ అవుతాయని ఒత్తిడిచేసి తరలించారు. మహిళలు భయాందోళనకు గురై మంత్రి కార్యక్రమానికి చేరుకున్నారు. ఉదయం 9గంటలకు కార్యక్రమమని చెప్పి 11గంటలైనా మొదలుకాకపోవడంతో వందలాది మంది మహిళలు వెనుతిరి వెళ్లిపోయారు. చంటి బిడ్డలతో వచ్చిన మహిళలు సరైన సౌకర్యాలు లేక కూర్చునేందుకు కుర్చీలు లేక తాగడానికి నీరులేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వచ్చిన మహిళలకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో నిలువ నీరు లేక ఎండలోనే భోజనాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆసరా పథకం వద్దు, మీటింగులు వద్దంటూ సభ ప్రాంగణం నుంచి పలువురు మహిళలు ఇంటిబాటపట్టారు. సభాప్రాంగణం ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చింది.


మండుటెండలోనే భోజనం చేస్తున్న మహిళలు

లేపాక్షి ఆలయంలో ప్రత్యేక పూజలు


వీరభద్రస్వామికి ప్రత్యేక అలంకరణ

లేపాక్షి, ఫిబ్రవరి 12: మాఘమాసం తొలి సోమవారం దుర్గా వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరభద్రస్వామి పాపనాశేశ్వరస్వామి, రఘునాథస్వాములను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లకు పూజలు చేశారు.

చంద్రమౌళేశ్వరస్వామికి...


అలంకరణలో స్వామివారు

మడకశిర టౌన్, ఫిబ్రవరి 12: మాఘ మాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ఆకుపూజ, అభిషేకాలు చేశారు. శివమాల ధరించిన భక్తులు ఉదయాన్నేస్వామి వారికి అభిషేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని మెట్టబండ ఆంజినేయస్వామి, అభయ ఆంజినేయస్వామి, కోట వెంకటేశ్వరస్వామి తదితర దేవాలయాల్లో విశేష పూజలు అర్చనలు అభిషేకాలు నిర్వహించారు.

రేణుకా యల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గోరంట్ల, ఫిబ్రవరి 12: పట్టణంలో ఈడిగ గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ఆలయంలో రేణుకా యల్లమ్మ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సోమవారం ఘనంగా నిర్వహించారు. అలాగే ఈడిగ కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించారు. పురోహితులు నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మూడురోజులుగా హోమాలు, శిఖర కలిశ స్థాపన, అభిషేకం, ప్రత్యేక పూజలు, మహా మంగళహారతి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం. శేఖర్, కాంగ్రెస్ నాయకుడు కేటీ శ్రీధర్, రమేష్‌గౌడ్, జగలేటి శ్రీనివాసులు, మహేష్, శివసాయిబాబా, రామక్రిష్ణప్ప, పుల్లారెడ్డి, గౌడ సంఘం నాయకులు గిరిధర్‌గౌడ్, నారాయణప్ప, డ్రైవర్ వెంకటరాముడు, రంగప్ప, వేణుగోపాల్ మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

గంగమ్మ విగ్రహం ఊరేగింపు


అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

పెనుకొండ టౌన్ (సోమందేపల్లి), ఫిబ్రవరి 12: సోమందేపల్లి గ్రామంలోని పొలిమేరలో వెలసిన గంగమ్మ విగ్రహం ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. సోమవారం గంగమ్మకు ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం పురవీధుల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు.

వైభవంగా చౌడేశ్వరీదేవి రథోత్సవం


అలంకరణలో అమ్మవారు

మడకశిర రూరల్ ఫిబ్రవరి 12: మండలంలోని మెళవాయి గ్రామంలో వెలసిన చౌడేశ్వరీ దేవి రథోత్సం సోమవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ప్రత్యేక అలంకరణచేసిన పూజలు నిర్వహించారు. ఉదయం గంగపూజ నిర్వహించిన అనంతరం అమ్మవారి రథాన్ని లాగారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన


పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఈరన్న

రొళ్ల, ఫిబ్రవరి 12: మండలం బంద్రేపల్లి బైలాంజనేయస్వామికి జీర్ణోద్ధరణ, విమాన గోపురం, కలశ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, రాష్ట్ర వక్కలిగ కన్వీనర్ వి.ఎం.పాండురంప్ప, నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బ్యాంక్ సేవలు వినియోగించుకోండి

గుడిబండ, ఫిబ్రవరి 12: కెనరాబ్యాంక్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీఎం రాంప్రసాద్‌రెడ్డి, ఎల్‌డీఎం రమణకుమార్ కోరారు. సోమవారం మండలంలోని మందలపల్లిలో నూతనంగా నిర్మించిన బ్యాంకు కార్యాలయ భవనాన్ని సోమవారం వారు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఐదేళ్లక్రితం మందలపల్లిలో బ్యాంకును ఏర్పాటుచేశామని, ఈ బ్యాంక్ ద్వారా రైతులకు విరివిగా రుణాలు అందించామన్నారు. బ్యాంక్‌లో రూ.30కోట్ల నుంచి రూ.60కోట్లదాకా లావాదేవీలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో గుడిబండ కెనరాబ్యాంక్ మేనేజర్ లోక్‌నాథ్‌రెడ్డి, ఖాతాదారులు షబ్బీర్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ తనిఖీ

అగళి, ఫిబ్రవరి 12: మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌ను ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, భోజన వసతి సదుపాయాలు తదితర వాటిపై ఆరాతీశారు. రికార్డులను పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈయన వెంట వార్డన్ సికిందర్ బాషా, సిబ్బంది ఉన్నారు.


హాస్టల్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ